సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఉత్సాహంగా వాక్‌థాన్



స్టీల్‌ప్లాంట్‌లో వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న సీవీవో కరుణరాజు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం వాక్‌థాన్ ఉత్సాహంగా జరిగింది. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా స్పోర్ట్స్ విభాగం సహకారంతో ఉక్కు స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన వాక్‌థాన్‌ను స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీవో) డాక్టర్ ఎస్. కరుణరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత, ఆరోగ్యం, పర్యావరణంపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవినీతిని అరికట్టడానికి నిజాయితీతో పాటు సమగ్రతను కాపాడుకోవడం ముఖ్యమన్నారు. ఉక్కునగరంలోని సుమారు 4 కిలోమీటర్ల మేర జరిగిన వాక్‌థాన్‌లో సుమారు 300 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాల్గొన్నారు.

అభినందన



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉక్కునగరం: స్థానిక అరబిందో పాఠశాల విద్యార్థులు టెన్నికాయిట్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. కె. లక్ష్మీ నాగలోచన, బి. గౌతమ్, వాలీబాల్ విభాగంలో.. బి. సతీష్, కబడ్డీలో జె. జాన్, హాకీలో మేరిటోసాలు విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో కరస్పాండెంట్ డాక్టర్ వి. రామారావు ఎంపికైన విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు జి. కనకారావు, ఎన్. నవీన్‌లను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్త టి. ఎల్లేశ్వరరావు, ప్రిన్సిపాల్ జోసెఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలు ప్రారంభం



బాణసంచా దుకాణాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ: దీపావళి పర్వదినాన్ని ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కనకదుర్గ మార్కెట్ చిల్లర వర్తక సంఘం ఆధ్వర్యంలో వినాయకనగర్ వుడా కాలనీలోని ఆదర్శ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూలోక మాత పండగ



భూలోక మాంబ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో భూలోక మాత అమ్మవారి పండగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో మంగళవారం అమ్మవారిని భక్తులు దర్శించుకుని పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలు, సమర్పించారు. సాయంత్రం ఘటాలను ఊరేగించారు.



ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు



కొనుగోలుదారులతో రద్దీగా బాణసంచా దుకాణం

ధరల షాక్

మార్కెట్‌లోకానరాని దీపావళి సందడి

- పూజాసామగ్రి ధరలకు రెక్కలు
- మండుతున్న బాణసంచా రేట్లు
- నెలాఖరు కావడంతో పండగ ఖర్చుపై ప్రభావం

గాజువాక: వెలుగుల దీపావళి వచ్చేసింది. పూజా సామగ్రి నుంచి బాణ సంచా ధరలు షాక్ కొట్టడంతో ప్రజలు ఆలోచించి సన్నద్ధమవుతున్నారు. ప్రమిదలు, పూజా సామగ్రి కొనుగోలుతో కొంతమంది సరిపెడుతున్నారు. కాగా షీలానగర్ వద్ద జరిగిన బాణసంచా విక్రయాలు ఇప్పుడు గాజువాకలోని ఆదర్శ గ్రౌండ్ సహా అన్ని ప్రాంతాల్లో ప్రారంభమయ్యాయి. దీంతో సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లలో సందడి మొదలైంది. అయితే బాణసంచా ధరలు బాంబుల్లా పేలుతున్నాయి. రూ.3 నుంచి రూ. 6 వేలు పెట్టినా కుటుంబానికి సరిపడా మందుగుండు సామగ్రి రాని పరిస్థితి ఉంది. దీంతో కొద్ది మొత్తంలో కొనుగోలు చేసి వెనుతిరుగుతున్నారు. మరోవైపు నిత్యావసర సరకుల ధరలు కూడా ఆకాశాన్ని అంటడం..దీపావళి నెలాఖరులో రావడంతో పండగ మరింత ప్రియంగా మారిందని ప్రజలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు.



దుకాణాల్లో అలంకరణ సామగ్రి

మూడు చోట్ల బాణ సంచా విక్రయాలు

గాజువాక పట్టణంలో మూడు చోట్ల బాణసంచా విక్రయ కేంద్రాలను వ్యాపారులు ప్రారంభించారు. షీలానగర్, ఆదర్శ గ్రౌండ్, స్టీల్‌ప్లాంట్‌లో ఈ విక్రయాలు సాగుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ కో ఆపరేటివ్ స్టోర్స్‌లో మూడు రోజులుగా బాణసంచా విక్రయాలు సాగుతున్నాయి. నగరంలో మిగిలిన అన్ని ప్రాంతాలకంటే స్టోర్స్‌లో తక్కువ ధరలకు లభిస్తాయనే విషయం తెలిసిందే.

వెలుగుల పండగ

అజ్ఞాన చీకట్లను పారదోలి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ దీపావళి పండగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకొంటున్నారు. అందులో భాగంగా దీపాలను కొట్టడానికి అవసరమైన చెరకు గెడలు, వివిధ మొక్కలకు సంబంధించిన పుల్లలను మార్కెట్‌లో విరివిగా విక్రయిస్తున్నారు. ప్రమిదలు, కొవ్వొత్తుల కొనుగోలుకు సైతం జనం క్యూ కట్టారు. కాగా, ఈసారి దీపావళి సామగ్రి ధరలు నింగినంటాయని కొనుగోలుదారులు పెదవి విరుస్తున్నారు. దీంతో పూజకు అవసరమైన సామగ్రితో సరిపెట్టుకోవాల్సి వచ్చిందని చెబుతున్నారు.

ధరలు పెంచేశారు

దీపావళి పూజ సామగ్రి ధరలు విపరీతంగా పెంచేశారు. డజను ప్రమిదలు రూ.50 చెబుతున్నారు. చిన్న చిన్న కొవ్వొత్తుల ధరలు కూడా ఆకాశాన్ని అంటాయి. ఈ పరిస్థితుల్లో అవసరమైనన్ని ప్రమిదలు, కొవ్వొత్తులు గాని కొనడం కుదరలేదు. – రాజ్యలక్ష్మి, గాజువాక

బాణసంచా ధరలు ఘోరం

బాణసంచా ధరలు చాలా ఘోరంగా ఉన్నాయి. ఏది కొనాలన్నా మాట్లాడే పరిస్థితి లేదు. ఐదు చిచ్చుబుడ్లు ఉండే ప్యాకెట్ రూ.300 అమ్ముతున్నారు. వెరైటీల పేరు చెప్పి మరీ పెంచేశారు. మాలాంటి సామాన్యులకు ధరలు అందుబాటులో లేవు.

– సుధాకర్, గాజువాక

ముక్కు మూసుకోవాల్సిందే..



సెక్టార్-1లో రోడ్డు పక్కన చేరిన మురుగునీరు

అగనంపూడి: ఆ మార్గంలో ప్రయాణం చేసే వారు ఎవరైనా ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే.. లేని పక్షంలో దుర్వాసనకు ముక్కుపుటాలు అదిరిపోతాయి. జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1 దాటిన తర్వాత వెదుళ్లనరవ కొత్తూరు మర్రిచెట్టు జంక్షన్ వద్ద ఇందిరాకాలనీ, సెక్టార్–1 వాసులు వినియోగించే వాడుక నీరు ఇక్కడ చేరిపోతుంది. మురుగునీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీటి గుంటల్లో పందులు, విష జంతువులు, క్రిములు, దోమలు చేరుతున్నాయి. పందులు చేరి అపరిశుభ్రం చేస్తున్నాయి. దీనికి ఎదురుగా ఉన్న ఆసావాల వారు దుర్వాసనతోపాటు దోమలు, పందులతో సతమతమౌతున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. పెద్ద ఎత్తున వర్షాలు కురిస్తే వర్షపునీటితో కలిపి మురుగునీరు రోడ్డు వెంబడి ప్రవహిస్తూ స్థానికులకు పరీక్షపెడుతుంది. వాడకం నీరు మళ్లించేందుకు ఔట్‌లెట్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పాల సేకరణ ధర పెంచాలని ధర్నా

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీ ఆవుపాల సేకరణ ధర తగ్గించడంపై రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ డెయిరీ ఎదుట ఆందోళన చేపట్టారు. వీరికి సీఐటీయూ, జనసేన నాయకులు మద్దతుగా నిలిచారు. ఆవుపాలకు రూ.50, గేదెపాలు లీటరుకు రూ.100 రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆందోళన నిర్వహిస్తున్న రైతు సంఘాలు, పాడి రైతులు వద్దకు డెయిరీ యాజమాన్య ప్రతినిధి జీఎం ఏవీఎంకుమార్ వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. పాడి రైతుల డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తామని జీఎం తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా నాయకులు ఎస్.బ్రహ్మాజీ, జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు తదితర నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వారితో మాట్లాడుతున్న డెయిరీ జీఎం కుమార్

పోస్టర్ ఆవిష్కరణ

అగనంపూడి: అగనంపూడి సత్యసాయి భజన మండలి 18వ వార్షికోత్సవ వివరాలతో రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సత్యసాయి భజన మండలి కోఆర్డినేటర్ బి.వి.సుబ్బారావు మాట్లాడుతూ 18 ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలతో భజనమండలి ప్రాచుర్యాన్ని పొందిందన్నారు. కమిటీ ప్రతినిధులతో పాటు స్థానిక ప్రజల సహకారంతో సేవా కార్యక్రమాలు విరివిగా చేపడుతున్నామన్నారు. వచ్చేనెల 3వ తేదీన పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ విందుల పైడినాయుడు, విందుల వరహాలు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.



వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న భజన మండలి ప్రతినిధులు

బ్రెయిన్ స్ట్రోక్ ముప్పు యువతకే ఎక్కువ



డాక్టర్ సీహెచ్.విజయ్

అక్కిరెడ్డిపాలెం: బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే వారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సీహెచ్.విజయ్ అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో అంతర్జాతీయ బ్రెయిన్ స్ట్రోక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా మెదడుకు ఆక్సిజన్, పోషకాలు తీసుకువెళ్లే రక్తనాళాలకు అవరోధం కలగడం లేదా చిట్లడం వల్ల మెదడులోని కొంత భాగం పని చేయక పోవడాన్ని బ్రెయిన్ స్ట్రోక్ అంటారని తెలిపారు. యువత ఎక్కువగా స్మోకింగ్, ఆల్కాహాల్ వంటి అలవాట్ల వల్ల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. జీవన విధానంలో మార్పులు, రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, ఊబకాయం, గుండె జబ్బులు, గర్భనిరోధక మాత్రలు వాడిన మహిళల్లో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

బీటీ రోడ్ నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్టాలిన్ తదితరులు

గాజువాక: జీవీఎంసీ72వ వార్డులోని వందడుగుల రోడ్‌లో చేపట్టిన బీటీ రోడ్ పనులను ఆ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ ప్రారంభించారు. గాజువాక పోలీస్ స్టేషన్ జంక్షన్ నుంచి జగ్గు జంక్షన్ వరకు రూ.1.99 కోట్లతో ఈ పనులను చేపట్టినట్టు ఆయన తెలిపారు. వార్డులో మౌలిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఆయన వెంట జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.ఎస్.అప్పారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎమినిటీ సెక్రటరీ వంశీ, సీపీఐ నాయకుడు జి.ఆనంద్ తదితరులు ఉన్నారు.

వైద్య సేవలపై ఆరా

అగనంపూడి: జిల్లా ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృంద ప్రతినిధులు 87వ వార్డులోని ఆస్పత్రి, పాఠశాలలు, వార్డు సచివాలయాల్లో అందుతున్న సేవలను పరిశీలించారు. టాస్క్‌ఫోర్స్ అధికారి కె.వి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ముందుగా కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత కణితి కాళింగ వీధి, ఎస్సీ కాలనీలోని వార్డు సచివాలయాల్లో గర్భిణుకు చేస్తున్న వైద్య పరీక్షలు, సేవలకు సంబంధించి వివరాలు సేకరించారు. తర్వాత ఫకీర్‌తక్యా ఉర్దూ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేపట్టారా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో హెచ్‌బీ శాతాలను పరిశీలించారు. హెచ్‌బీ శాతం తక్కువగా ఉన్న విద్యార్థులు విధిగా ప్రభుత్వం అందించే మాత్రలు వేసుకోవడంతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎన్ మనోరమ, కణితి పీహెచ్‌సీ విస్తరణాధికారి దొరబాబు, సిబ్బంది వరలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



కణితి పీహెచ్‌సీలో సేవలపై ఆరా తీస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

'మహా' దారులు అధ్వానం



బొర్రమ్మగుడికి వెళ్లే కూడలిలో ధ్వంసమైన రహదారి



జాతీయ రహదారి సమీపంలో గోతులతో నిండిన రహదారి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు నుంచి 88వ వార్డు దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి ధ్వంసమైంది. పలుచోట్ల రోడ్డు శిథిలం కావడంతో వాహనచోదకులు బెంబేలెత్తుతున్నారు. జాతీయ రహదారి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో సెక్టార్–1,2 అనుసంధాన రింగ్ రోడ్డు కూడలి, చింతలగెడ్డ, ఏపీ రీఫ్రాక్టరీస్ ప్రాంతాల్లో రహదారి చాలా వరకు గోతులతో నిండిపోయింది. నెలల నుంచి గోతులు పూడ్చకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ అధికారులు, పాలకులు స్పందించి గోతులు పూడ్చి వాహనచోదకులు ప్రమాదాలకు గురికాకుండా చూడాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్

డంపింగ్ యార్డా..! రోడ్డా..!

జీవీఎంసీ 64వ వార్డు యాతపాలెం వెళ్లే ప్రధాన రహదారి డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఎక్కడెక్కడి నుంచో వాహనాల ద్వారా తీసుకువచ్చి పట్ట పగలే చెత్తాచెదారం, భవనాలకు చెందిన డెబ్రిస్‌ను విచ్చలవిడిగా పడేస్తున్నారు. అంతేకాకుండా ఆటో నగర్‌లో పలు పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను కూడా ఇక్కడే పడేయడంతో ఈ రోడ్డు మొత్తం డెబ్రిస్, మట్టితో నిండిపోయింది. గుట్టలు గుట్టలుగా డెబ్రిస్ పేరుకుపోతున్నా.. వారిని అడ్డుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి చెత్తా చెదారం డంప్ చేస్తున్న వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

– పెదగంట్యాడ







క్యారమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ

అక్కిరెడ్డిపాలెం: విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్యారమ్స్ పోటీల్లో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు. మంగళవారం వీరిని పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం అభినందించారు. అక్కయ్యపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌ల్లో జరిగిన పోటీల్లో అండర్ 14 విభాగంలో 6వ తరగతి విద్యార్థినులు జి.హరిప్రియ, బి.అక్షయ, 8వ తరగతి విద్యార్థి పి.దీక్షిత, 9వ తరగతి విద్యార్థి విజయం సాధించగా, అండర్- 17 విభాగంలో 10వ తరగతి విద్యార్థులైన కె.కోమలి, సీహెచ్.కుమారి, జె.ఢిల్లేశ్వరి ప్రతిభ చూపారని పీడీ మహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. వీరు త్వరలో ప్రకాశంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు కుమారస్వామి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కాంతం, ఉపాధ్యాయులు

విశాఖ ఉక్కును ఆదుకోవాలని వినతి

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ గాజువాక బీజేపీ నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. విశాఖ విచ్చేసిన ఆయన్ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం కలిశారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి అవసరమైన ఆర్థిక సహాయం అందజేయాలని, సొంత గనులను కేటాయించి మరింత అభివృద్ధి చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు వెన్న శ్రీరామ్మూర్తి ఉన్నారు.

సత్కారం

గాజువాక: విశాఖ పర్యటనకు విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను మంగళవారం బీజేపీ గాజువాక పారిశ్రామిక ప్రాంత నాయకులు సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, పోలిమేర శ్రీనివాసరావు మంత్రిని సత్కరించి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.



మంత్రి బండి సంజయ్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఎంపీ దృష్టికి వేతనాల సమస్య



ఎంపీ భరత్‌కు సమస్యను వివరిస్తున్న స్టీల్‌ప్లాంట్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సత్వరమే వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. మంగళవారం రాత్రి కమిటీ నాయకులు విశాఖ ఎంపీ శ్రీ భరత్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. దీపావళి వచ్చినా వేతనాలు చెల్లించకుండా యాజమాన్యం కాలయాపన చేస్తుందన్నారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ కేంద్ర ఉక్కుమంత్రి దృష్టికి విషయాన్ని తీసుకు వెళ్లి పరిష్కారానికి సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, యు. రామస్వామి, వరసాల శ్రీనివాస్, రామ్మోహన్‌కుమార్, గణపతిరెడ్డి, రామకృష్ణ, డేవిడ్, రాజా, అప్పలరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.